RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

SAMA SAMAJAM TELUGU DAILY

గురు వారం
02-03-2023
సంపుటి - 08,
సంచిక - 266
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## శ్రీచైతన్య ప్రైవేటు కాలేజీలో

# రాలిన మరో విద్యాకుసుమం

- ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య
- క్లాస్ రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్న సాత్విక్
- కళాశాల యాజమాన్యం తీరుపై విద్యార్థి సంఘాల ఆందోళన
- కాలేజీ యాజమాన్యంపై చర్యలకు తల్లిదండ్రుల డిమాండ్

**హైదరాబాద్,మార్చి1(సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా నార్సింగిలోని శ్రీచైతన్య ప్రైవేటు కాలేజీలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ ఆత్మహత్య కలకలం రేపుతోంది. మంగళవారం రాత్రి 10 గంటల 30 నిమిషాల సమయంలో ఎన్. సాత్విక్ అనే విద్యార్థి క్లాస్ రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాలేజీలో ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు స్వాతిక్ స్నేహితులు, ఇతర విద్యార్థులు చెబుతున్నారు. సాత్విక్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో కనీసం కాలేజీ సిబ్బంది పట్టించుకోలేదని, ఆస్పత్రికి కూడా తీసుకెళ్లలేదని చెబుతున్నారు. తోటి విద్యార్థులే దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలుస్తోంది. అయితే.. ఆస్పత్రికి తరలించే లోపే సాత్విక్ చనిపోయాడు. పోస్ట్‌మార్టం కోసం ఉస్మానియా మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు..కాలేజీ విద్యార్థులను సిబ్బంది బాగా టార్చర్ పెడుతున్నారని కొంతమంది విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కాలేజీ క్లాస్ రూమ్ లోనే విద్యార్థులను



3వ పేజీలో...

## బ్యాడ్మింటన్ ఆడుతూ వ్యక్తి మృతి



**హైదరాబాద్,మార్చి1(సమ సమాజం):** సికింద్రాబాద్ లాలాపేట్ లోని ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడుతూ.. పరమేష్ యాదవ్(39) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న లాలాగూడా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం కోసం పరమేష్ మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ మార్చురీకు తరలించారు. గత రాత్రి 9 గంటల 30 నిమిషాల సమయంలో గుండెపోటుతో పరమేష్ చనిపోయినట్లు చెబుతున్నారు. మృతుడు పరమేష్ మల్కాజిగిరి వాసి.

## మొఘల్‌పురాలో పోలీసుల ఘాతుకం

### చితకబాదిన ఘటనపై సిసి ఫుటేజ్ ఆధారంగా ఫిర్యాదు

**హైదరాబాద్,మార్చి1(సమ సమాజం):** పాతబస్తీ మొఘల్ పురాలో ఓ యువకుడిని పోలీసులు చితకబాదిన సంఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నారు. తనను అకారణంగా పోలీసులు కొట్టారని బాధితుడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. సీసీ టీవీ ఫుటేజీని కూడా అందించడంతో ఈ సంఘటనను అధికారులు సీరియస్ గా తీసుకున్నారు. బాధితుడు మహమ్మద్ ఇబ్రహీం తెలిపిన వివరాల ప్రకారం.. షాప్ మూసివేసి ఇంటికి తిరిగి వెళ్తున్న



3వ పేజీలో...

## యూకె పర్యటనలో రాహుల్ గాంధీ

### స్మార్ట్‌గా తయారైన యువనేత



**న్యూఢిల్లీ, మార్చి 1 (సమ సమాజం):** దేశవ్యాప్తంగా పాదయాత్ర వేళ గుబురు గడ్డంతో భీకరంగా కనిపించిన రాహుల్ గాంధీ తన ముఖ స్వ్వాపాన్నిఇన మార్చేశాడు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఉపన్యాసానికి ముందు రాహుల్ గాంధీ తన లుక్ పూర్తిగా మార్చేశాడు. మొదటిసారిగా తన జుట్టు మరియు గడ్డాన్ని కత్తిరించారు. కాంగ్రెస్ నాయకుడు ఒక వారం పర్యటన కోసం మంగళవారం లండన్‌లో అడుగుపెట్టారు. ఇందులో తన విద్యాసంస్థ అయిన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఉపన్యాసం ఇవ్వనున్నారు. కేంబ్రిడ్జ్ జడ్జి బిజినెస్ స్కూల్

3వ పేజీలో...

# మారోమారు గ్యాస్ భారం

## సిలిండర్‌పై రూ.50 పెంపు


**న్యూఢిల్లీ, మార్చి 1 (సమ సమాజం):** సామాన్యులకు కేంద్ర ప్రభుత్వం మరోమారు షాక్ ఇచ్చింది. గృహ వినియోగ గ్యాస్‌తో పాటు కమర్షియల్ గ్యాస్ ధరలను చమురు కంపెనీలు భారీగా పెంచాయి. గృహ వినియోగ వంట గ్యాస్‌పై రూ.50 పెంచాయి. వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 పెరిగింది. పెరిగిన ధరలు బుధవారం నుంచి అమలులోకి వస్తాయని తెలిపాయి. పెరిగిన ధరలతో డొమెస్టిక్ సిలిండర్ ధర దేశ రాజధానిలో రూ.1,103కు చేరింది. వాణిజ్య సిలిండర్ ధర రూ.2,119కి పెరిగింది. హైదరాబాద్‌లో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.1175కి చేరింది. డొమెస్టిక్ గ్యాస్ లిండర్ ధర దాదాపు ఎనిమిది నెలల తర్వాత రూ.50 పెరిగింది. గత ఏడాది జూలై నుంచి ధరలు స్థిరంగా కొనసాగుతూ వచ్చాయి. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్యులు విలవిలలాడుతుండగా.. తాజాగా పెరిగిన ధరలతో మరింత భారపడనున్నది.




## అత్యాచారలకు పాల్పడే వారి ఇళ్లను బుల్‌డోజర్లతో కూలుస్తాం

- యోగి ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని పాలిస్తాం
- మహిళామోర్చా కార్యక్రమంలో బండి సంజయ్

**హైదరాబాద్, మార్చి 1 (సమ సమాజం):** బీజేపీ ప్రభుత్వం వచ్చాక మహిళలపై అత్యాచారాలు చేసే వారి ఇళ్లను బుల్డోజర్స్‌తో కూల్చుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించే విషయంలో ఉత్తరప్రదేశ్ లోని యోగి ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని పని చేస్తామన్నారు. లిక్కర్ స్కాం ప్రభుత్వాన్ని గద్దె దించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ కార్యాలయంలో జరిగిన మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ..



3వ పేజీలో...

## స్కూల్ పిల్లలపై దూసుకెళ్లిన కారు

### ముగ్గురు విద్యార్థులు అక్కడిక్కడే దుర్మరణం

**చెన్నై, మార్చి 1 (సమ సమాజం):** స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులపైకి ఒక కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు బాలురు మరణించారు. వారి మృతికి కారణమైన నిందితుడ్ని కాలేజీ స్టూడెంట్‌గా పోలీసులు గుర్తించారు. తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వాణియంబాడి ప్రాంతానికి చెందిన రఫీక్, అన్నాదమ్ములైన విజయ్, సూర్య కలిసి మంగళవారం ఉదయం సైకిళ్లపై స్కూల్‌కు వెళ్తున్నారు. హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై సైకిళ్లు తొక్కుతూ వెళ్తున్న వారిపైకి ఒక ఎస్‌యూవీ వాహనం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురు బాలురు మరణించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 13 ఏళ్ల లోపున్న ముగ్గురు స్కూల్ విద్యార్థులపైకి కారును దూకించిన

3వ పేజీలో...

# కార్డియాక్ అరెస్టును నిరోధించడం ముఖ్యం

- సకాలంలో సిపిఆర్ చేస్తే ప్రాణాలు నిలుస్తాయి
- సిపిఆర్ శిక్షణా కార్యక్రమంలో మంత్రులు కెటిఆర్, హరీష్

**హైదరాబాద్,మార్చి1(సమ సమాజం):** హైదరాబాద్ మహా నగరంలో లక్ష మందికి సీపీఆర్ శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సూచించారు. జిల్లాల్లో వందలమందికి ఈ శిక్షణ ఇవ్వాలన్నారు. మేడ్చల్ జిల్లాలో సీపీఆర్ శిక్షణను ప్రారంభించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. హైదరాబాద్ కొంపల్లిలోని ఈఎంఆర్ఐ, జీహెచ్ఎస్ లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లకు కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, మల్లారెడ్డిలు పాల్గొన్నారు. కానిస్టేబుళ్లకు సీపీఆర్ ఎలా చేయాలో ట్రైనర్ మార్గ నిర్దేశం చేశారు. ఆ సమయంలో సీపీఆర్ చేసే వారికి ఎక్కువ బలం



3వ పేజీలో...

## కెసిఆర్ అండతో ఆలయాలకు పూర్వవైభవం



- తిరుమాలయపల్లిలో శ్రీలక్ష్మీనారసింహ ఆలయ ప్రతిష్టాపన
- చినజీయర్ స్వామి చేతుల మీదుగా ప్రారంభం

**వరంగల్, మార్చి 1 (సమ సమాజం):** తెలంగాణలోని పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకోచ్చేందుకు సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ దయవల్ల తెలంగాణలోని దేవాలయాలు అన్నీ పూర్వ వైభవాన్ని సంతరించు కున్నాయని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిరుమలాయపల్లి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి చేతుల మీదుగా బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. యంత్ర ప్రతిష్ఠాపన, మూర్తి స్థాపన,

3వ పేజీలో...

# సంపాదకీయం

## విద్యారంగంలో పెడధోరణలుపై కొరడా ఝులిపించాలి !

విద్యారంగం భ్రష్టు పట్టిపోతోంది. విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతోంది. వారిలో మానసిక ఆందోళన పెరుగు తోంది. ప్రశాంత వాతావరణంలో విద్యను ఆస్వాదించే అవకాశాలు లేకుండా పోయాయి. విద్య మొత్తం ఒత్తిడిలోనే సాగుతోంది. ఎల్‌కెజి నుంచి...పిజి వరకు అంతా ఒత్తిడిమయంగా మారింది. దీనికితోడు విద్యలో నైతిక విలువలు లోపించాయి. నైతిక విలువలను నేర్పే పాఠ్యాంశాలు చిన్ననాటి నుంచే నేర్పించాల్సిన గురువులు..పిల్లలను కేవలం పుస్తక పురుగులుగా తయారు చేస్తున్నారు. బట్టీపట్టించే విధానాలు ఎక్కువ య్యాయి. విషయ పరిజ్ఞానం లేకుండా చేస్తున్నారు. విద్‌ఆయర్థుల్లో సోదరభావం నశించింది. ఇతరలును గేలిచేయడం లేదా వేదించడం ఎక్కువయ్యింది. అలాగే కాలేజీకి చదువుల కోసం కాఉండా అమ్మాయిలను ట్రాప్ చేయాలని వస్తున్న వారు కూడా ఉంటున్నారు. ఇలాంటి మృగాళ్లతో అమ్మాయిలకు రక్షణ లేకుండా పోతోంది. బేటీపడావో..బేటీ బచావో అన్నది నినాదంగానే మిగిలింది. ఇకపోతే ప్రభుత్వాలు కూడా విద్యా వ్యవస్థలో ఏం జరుగుతోందో పెద్దగా పట్టించుకోవడం లేదు. పాఠశాలలు, కళాశాలల్లో ఏం జరుగు తుందో గమనించడం లేదు. ఆరోపణలు వచ్చినా..ఆత్మహత్యలు, వేధింపులు, మర్డర్ కేసులు వరుసగా కలవర పెడుతున్నా కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. కారణాలను అన్వేషించడం లేదు. మెడికో ప్రీతిని సీనియర్ మెడికో సైఫ్ అన్న దుర్మార్గుడు టార్చర్ పెట్టడంతో ఆమె ఆత్మహత్యచేసుకుంది. ప్రేమ కోసం ఓ యువకుడు తోటి స్నేహితుడు నవీన్‌ను కిరాతకంగా చంపేశాడు. మరో ఇంజనీరింగ్ విద్యార్థిని రక్షితను ర్యాగింగ్ చేయడంతో ఆత్మహత్య చేసుకుంది. తాజాగా సాత్విక్ అనే ఇంటర్ విద్యార్థి కాలేజీలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా పిల్లల జీవితం అర్థాంతరంగా ముగియడం అన్నది తల్లిదండ్రులకు కడుపుకోతగా మిగులుతోంది. తమ పిల్లలు క్షేమంగా, ప్రయోజకులుగా తిరిగి వస్తారన్న నమ్మకం లేని విద్యావ్యవస్థలో మనం బతుకుతున్నాం. కార్పోరేట్ కాలేజీలు, స్కూళ్లలో దోపిడీలు జరుగుతున్నా ప్రభుత్వాలు మిన్నకుంటు న్నాయి. వారినుంచి పెద్దమొత్తంలో వసూళ్లకు మరిగిన అధికారులు, నాయకులు వారికి వత్తాసుగా నిలుస్తు న్నారు. ఫీజులు కట్టించుకోవడం..ఒత్తిడి పెంచడం, ఆత్మహత్యచేసుకుంటే మిన్నకుండడం అలవాటుగా చేసుకున్నారు. ఇతంటి దౌర్భాగ్యం నిత్యం మనం కళ్లారా చూస్తున్నాం. నిజానికి మెడికో ప్రీతి విషయంలో సీనియర్ విద్యార్థి వేధింపులపై ఫిర్యాదు అందగానే కఠినంగా వ్యవహరించి ఉంటే ఇలా జరిగి ఉండేది కాదు. ఘటన జరిగిన తరవాత కఠినంగా హెచ్చరించడం కాదు...ఘటనలు జరక్కుండా కఠినంగా ముందే హెచ్చరి కలు జారీచేయాలి. ర్యాగింగ్‌కు పాల్పడే వారిని చదువుకు దూరం చేయాలి. అలాంటి వారి తల్లిదండ్రలును పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలి. కానీ అలా జరగడం లేదు. సైఫ్ అయినా సంజయ్ అయినా ఊరుకు నేది లేదని కఠినంగా ప్రకటించిన మంత్రివర్యులు కెటిఆర్ ..ముందస్తు చర్యలకు దిగాలి. నారాయణ, చైతన్య లాంటి కాలేజీలపై వస్తున్న ఆరోపణలపై స్వయంగా విచారణ చేయాలి. రాజకీయాలు ఆపి అలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాలి.. ఫీజులు మొదలు వేధింపుల వరకు ఎలాంటి అక్రమాలు జరిగినా ఈ ప్రభుత్వం ఊరుకోదన్న సంకేతాలు ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. నిజానికి ఇవన్నీ చాలా సీరియస్ సమస్యలు. వీటిని పరిశీలించి...ఇలాంటి ఘటనలు జరక్కుండా కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఇది ఏ ఒక్క నగరానికో లేదా రాష్ట్రానికో పరిమితం కావడం లేదు. దేశభవిష్యత్తు తరగతి గదులలోనే రూపుదిద్దుకొంటుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నారు. కానీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న దయనీయ పరిస్థితులకు తాజాగా జరుగుతున్న ఘటనలు అద్దం పడుతున్నాయి. పిల్లల భవిష్యత్తు ఎంత ఘోరంగా ఉండబోతోందో అర్థం అవుతుంది. నైతికతలేని విద్యకు

వ్యతిరేక విధానాలకు ముగింపు పలకాలి. వ్యాపారంగా మారిన విద్య కారణంగా పేదలకు, సామాన్యులకు ఉచితంగా అందుబాటులోకి రాకుండా చేస్తున్నారు. లక్షలు పోసి చదువులు కొనడంతో పాటు.. పిల్లను పొట్టన పెట్టుకుంటున్నా ప్రభుత్వాల్లో చలనం కానరావడం లేదు. ఇలా ఎంతకాలం మిన్నకుండాలో చర్చించాలి. విద్యార్థుల మధ్య అంతరాలు పెంచే ప్రైవేటు విద్య క్రమంగా కోరలు చాస్తోంది. కులాలవారీ విద్యను నేర్పడం అవసరమా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. అమెరికా,యూరప్ వంటి దేశాల్లో మాదిరిగా ఇక్కడ అందరికీ ఒకేరకమైన విద్య అందుతుందా అన్నది ఆలోచన చేయాలి. విద్యారంగంలో చోటుచేసుకొంటున్న మార్పులే కావచ్చు..పెడధోరణులే కావచ్చు..పసిగట్టి పరిష్కరించాల్సింది పాలకులే. లేదా మేధావుల సూచనలను అయినా పాటించాలి. రాజ్యాంగం ఇచ్చిన ఉచిత విద్య హామీ గాలికి కొట్టుకుపోయింది. తాజాగా జరుగుతున్న విపరీత పరిణామాల నేపథ్యంలో ఎటువంటి విద్యా విధానం ఉండాలో, ఎలాంటి వాతావరణం కల్పించాలో చర్చించాలి. విద్యావంతులు, మేధావులు, వైస్‌ఛాన్సలర్లు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు, టీచర్లు, తల్లిదండ్రులతో సెమినార్లు, చర్చలు నిర్వహించాలి. వారి అభిప్రాయాలు తీసుకోవాలి. రక్షణతో కూడిన విద్యను అందించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యాభివృద్ధిని ప్రభుత్వం ప్రాధాన్యతారంగంగా స్వీకరించాలని పలు సందర్భాల్లో మేధావులు పదేపదే స్పష్టం చేస్తున్నారు. విద్యను ప్రాధాన్యతాంశంగా స్వీకరించకపోగా దానికి ఏ మాత్రం విలువనివ్వటం లేదు. ఇకపోతే ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలకు అతి తక్కువ నిధులు కేటాయిస్తున్న తీరు కూడా ప్రైవేట్ దోపిడీకి ఉపకరించేలా తయారవుతున్నది. ఇది ఓ రకంగా ప్రభుత్వమే తన బాధ్యతలను విస్మరించేలా చేసుకుంటోంది. ఈ పెడధోరణలను పారద్రోలి నైతికతతో కూడిన..భవిష్యత్‌ను బంగారుమయం చేసే విద్య కోసం పాటుపడాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# తిమ్మాపూర్ వేంకటేశ్వరుడికి 2కిలోల కిరీటం

దాతల సహకారంతో తయారుచేయించిన కెసిఆర్ సతీమణి ● బ్రహ్మోత్సవ కళ్యాణోత్సవంలో పాల్గొన్న కెసిఆర్ దంపతులు





తిమ్మాపూర్ గుడికి 7కోట్లు
బాన్సువాడ అభివృద్ధికి 50కోట్లు
కృతజ్ఞతా సభలో సిఎం కెసిఆర్ ప్రకటన

**కామారెడ్డి, మార్చి 1 (సమ సమాజం):** కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవంలో సీఎం కేసీఆర్ దంపతులు పాల్గొన్నారు. అక్కడ ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం సతీమణి శోభ.. దాతల సహకారంతో స్వామివారి కోసం తయారు చేయించిన 2 కిలోల బంగారు కిరీటాన్ని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా స్వామివారికి సమర్పించారు. అనంతరం సీఎం దంపతులను వేదపండితులు ఆశీర్వదించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో సీఎం దంపతుల వెంట స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు సంతోష్‌కుమార్, బీబీ పాటిల్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. కాగా, అంతకుముందు బాన్సువాడకు చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న సీఎం దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. కాగా, తిమ్మాపూర్‌లో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కన్నుల పండువలా జరుగుతున్న ఈ బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం కేసీఆర్, ఆయన సతీమణి శోభ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వారికి ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దాతల సహకారంతో స్వామి వారి కోసం తయారు చేసిన 2 కేజీల బంగారు కిరీటాన్ని సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు.

## ఆలేరు ఎమ్మెల్యే సునీత ఇంటిముందు ఆటో డ్రైవర్ల ధర్నా

యాదగిరిగుట్టపైకి ఆటోలు అనుమతించాలని డిమాండ్

తానేమీ చేయలేనని చేతులెత్తేసిన ఎమ్మెల్యే



**యాదాద్రి, మార్చి 1 (సమ సమాజం):** ఆలేరు నియోజకవర్గం టీఆర్ఎస్ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఇంటిముందు ఆటో డ్రైవర్లు ధర్నాకు దిగారు. యాదాద్రి కొండపైకి అనుమతి లేకపోవడంతో తమకు ఉపాధి దెబ్బతిన్నదని వారు వాపోయారు. తమకు గుట్టపైకి ప్రయాణికులను తీసుకుని వెళ్లేలా అనుమతించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే సునీత కీలక వ్యాఖ్యలు చేశారు. కొండపైకి ఆటోలు అనుమతించాలని ఎమ్మెల్యే ఇంటిముందు నిరసనకు దిగిన ఆటో కార్మికులతో మాట్లాడిన గొంగిడి సునీత... ఈ విషయంలో తానేం చేయలేనని, నా వల్ల కాదని చేతులు ఎత్తేశారు. కొండపైకి నడిపించుకునే ఆటోలు బంద్ అయి ఏడాది కావస్తోంది. ఏదైనా ఉంటే వెళ్లి ఆలయ ఈవోని అడగండి అంతా ఆమె చేస్తుందని ఎమ్మెల్యే సూచించారు. ఈవోతో మాట్లాడినా ఆమె వినలేదని, భూపాల్ రెడ్డితో మాట్లాడినా ఈవో వినడం లేదన్నారు. సీఎం దగ్గరికి వెళ్లి అడిగినా ప్రయోజనం లేదని తెలిపారు. మీరు ఆటోలు ఒక్కటే నడుపుతాం అని కాకుండా వేరే పనులు ఏవైనా చూసుకోవచ్చు కదా అని ఎమ్మెల్యే చెప్పారు. ఈ విషయంలో తన వంతుగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశానని. ఇక తన వల్ల కాదని, తానేం చేయలేనని ఎమ్మెల్యే చెప్పారు. మీరు ఏమైనా చేసుకోండి, నన్ను క్షమించండి అంటూ ఆమె అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

## తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా

డబుల్ ఇళ్ల లబ్దిదారుల ఆందోళన




**జగిత్యాల, మార్చి 1 (సమ సమాజం):** జగిత్యాల అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్దిదారులు ఆందోళన చేపట్టారు. పట్టణ పరిధిలో మొత్తం 3355 మంది అర్హులను గుర్తించగా వారికి సంబంధించిన క్యాస్ట్, ఇన్ కమ్ సర్టిఫికేట్ ల కోసం ప్రజలు పెద్ద ఎత్తున కార్యాలయానికి తరలివచ్చారు. అయితే ఆర్ఐ ఒక్కడే ఉంటడం వల్ల సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుందని, మూడు రోజుల్లోపే అధికారులకు ఈ సర్టిఫికెట్లు ఇవ్వడం ఎలా సాధ్యం అని ప్రజలు అధికారులను నిలదీశారు. అర్హులు వారి దరఖాస్తులను మీ సేవలో సమర్పించి తహశీల్దార్ కార్యాలయంలో అప్పగిస్తే మూడు రోజుల్లోగా వారికి క్యాస్ట్, ఇన్ కమ్ సర్టిఫికేట్లు ఇస్తామని తహసీల్దార్ చెప్పారు. ఆందోళన చెందవలసిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే నిరుపేదలకు డబుల్ ఇండ్లు ఇవ్వకుండా ఉన్న వారికే ఇస్తున్నారని డబుల్ బెడ్ రూం లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తనుగుల ఇసుకరీచ్‌ను పరిశీలించిన రేవంత్



అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపణ

**కరీంనగర్, మార్చి 1 (సమ సమాజం):** హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో పర్యటిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బుధవారం తనుగుల ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇసుక రవాణాలో అక్రమాలు జరుగుతున్నాయని, ఒకే పర్మిషన్ మీద నాలుగు లారీల ఇసుక తరలిస్తున్నారని విమర్శించారు. అయితే, మొదట సరైన రూట్ మ్యాప్ లేకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. ఇసుక రీచ్ కు వెళ్లేందుకు దారి తప్పారు. సరైన దారి తెలియక రెండు సార్లు రాంగ్ రూట్‌కు వెళ్లారు. సింగిల్ రోడ్లల్లో కాన్వాయ్‌లను తిప్పలేక ఇబ్బంది పడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్ర కరీంనగర్ జిల్లాలో కొనసాగుతోంది. అందులో భాగంగా జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ దర్గాను సందర్శించిన రేవంత్ రెడ్డి దర్గా ఆచారం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలచాదర్ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డివి చౌకబారు ఆరోపణలు

ప్రజలకోసమే తాను పార్టీ మారాను

రేవంత్ లాగా స్వార్థం కోసం కాదన్న గండ్ర



**జయశంకర్ భూపాలపల్లి, మార్చి 1 (సమ సమాజం):** రేవంత్ రెడ్డి తమపై చౌకబారు ఆరోపణలు చేసినా చాలా ఓపికతో ఉన్నామని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు నిరాశలో ఉన్నారని చెప్పారు. మాట్లాడే తీరును రేవంత్ రెడ్డి మార్చుకోవాలని హెచ్చరించారు. నిన్నటి ఘటనలో కాంగ్రెస్ కార్యకర్తలే బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టారని చెప్పారు. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే దొంగే దొంగ అని అరిచినట్లు ఉందన్నారు. భూపాలపల్లిలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నిర్వహించిన 'హాత్ సే హాత్ జోడో' యాత్రలో జరిగిన సంఘటనలపై స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పందించారు. రేవంత్ రాజకీయ ప్రస్థానం ఎక్కడ మొదలైందో.. ఎక్కడి నుండి ఎక్కడకు వచ్చాడో ప్రజలందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పెద్ద నాయకుల కుట్రలు ఉంటాయని ఎమ్మెల్యే గండ్ర వ్యాఖ్యానించారు. 2009లో తాను గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా తన ఎదుగుదలను తొక్కేసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో తాను ఆస్తులు సంపాదించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేస్తే.. ప్రతి విషయంలోనూ తనను అణగదొక్కాలని చూశారని చెప్పారు. 2018లో మరోసారి కాంగ్రెస్ నుంచి గెలిచిన తర్వాత నియోజకవర్గం ప్రజల అభిప్రాయం మేరకు తాను బీఆర్ఎస్ లో చేరానని వివరించారు. తన భార్య గండ్ర జ్యోతి పదవికి కోసమే అధికార పార్టీలోకి వెళ్లాడని ఆరోపణలు చేస్తున్నారని తప్పుపట్టారు. తానొక్కడినే పార్టీ మారలేదన్నారు. సోనియాగాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని అసెంబ్లీలోనే కేసీఆర్ చెప్పేవారని తెలిపారు. తెలుగుదేశంలో ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డిని, సోనియాగాంధీని విమర్శించిన రేవంత్ రెడ్డి.. ఆ తర్వాత కాంగ్రెస్ లోకి వచ్చాడని విమర్శించారు. 'నీ రాజకీయ ప్రయోజనాల కోసం నువ్వు పార్టీ మారవచ్చు.. కానీ, ప్రజా అవసరాల కోరకు నేను పార్టీ మారకూడదా...?' అని రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే గండ్ర ప్రశ్నించారు. ముస్లింలకు చెందిన గుట్టలు ఉన్న స్థలాన్ని ఇండస్ట్రీ పెట్టడం కోసం న్యాయబద్దంగా కొంటే కబ్జా చేశారని రేవంత్ రెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నాడని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. ఆ స్థలం కబ్జా చేసినట్లయితే.. జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయాలి గానీ, ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. 'నా ప్రాంతం మీద అభిమానంతో ఫామాయిల్ ఇండస్ట్రీ పెట్టాలనుకుంటే భూమి కబ్జా చేశాడని రేవంత్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారు. 2023లోనూ భూపాలపల్లి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

## పార్టీ ఆదేశిస్తే విజయవాడ నుంచి పోటీ

వైఎస్‌కు ఆత్మశాంతి లేకుండా చేస్తున్నారు

జగన్ తీరుపై మండిపడ్డ రేణాకాచౌదరి



**అమరావతి, మార్చి 1 (సమ సమాజం):** ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖర్ రెడ్డికి ఈ సంతానం మూలంగా సుఖం లేకుండా పోయిందని మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి అన్నారు.. రాజశేఖర్‌రెడ్డికి ఆత్మశాంతి లేకుండా జగన్ ఈ పిచ్చివేషాలు వేస్తున్నారని మండిపడ్డారు. జగన్ అప్పుడు కూడా పిచ్చి వేషాలు వేసే వారని.. అయితే తండ్రిగా రాజశేఖర్ రెడ్డి బయటకు రాకుండా కాపాడినట్లు తెలిపారు. ఇక్కడి ప్రజల పరిస్థితి చూస్తో జాలిపడాలా, కోపం తెచ్చుకోవాలా, ఆక్రోషం తెచ్చుకోవాలో అర్థం కావడం లేదన్నారు. బంగారం లాంటి రాష్ట్రం పతనం అయిపోతోందని... సుప్రీంకోర్టు తీర్పులను కూడా సీఎం లెక్కచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఎందుకు సీఎంపై సుమోటోగా యాక్షన్ తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నిజానికి నేడు గుడివాడ వెళ్ళాల్సి ఉందని.. అయితే త్వరలో వస్తా ఇది ట్రయిల్ రన్ మాత్రమే అని రేణుక అన్నారు. విజయవాడ పార్లమెంటు నుంచి అయినా అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తానని ప్రకటించారు. నందమూరి తారకరామారావు కూడా రాజశేఖర్ రెడ్డిని గౌరవించేవారని... వారిరువురికి ఒకరిపై ఒకరికి గౌరవం ఉందని తెలిపారు. వారికి ఆత్మశాంతి లేకుండా ఈ పేర్లు ఇప్పుడు జగన్ మార్చారని అన్నారు. నందమూరి తారకరామారావు పేరు ఉంటే పెరుగుతారని... రాజశేఖర రెడ్డి పేరు పెట్టకపోతే ఆయన తరుగుతారు అనుకుంటే పొరపాటే అని చెప్పుకొచ్చారు. ముందు జగన్ నువ్వు ఓ యూనివర్సిటీని తీసుకురా అప్పుడు నీపేరో, తాతపేరో పెట్టుకో అంటూ హితవుపిలికారు. అమరావతి రైతులను ఎంత అడ్డంపడితే అంతగా వారి ఉద్యమం బలపడుతుందన్నారు. ఈ ఉద్యమం ద్వారా రైతు గౌరవాన్ని పెంచారని.... రైతులకు కులం లేదని అన్నారు. ఏ క్షణం అయినా రాజధాని రైతులు పిలిస్తే తాను వస్తానని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టులు చెప్పినా రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదన్నారు. సుప్రీంకోర్టు ముఖ్యమంత్రిపై యాక్షన్ తీసుకోవాలని లేకపోతే ప్రజలే సహాయనిరాకరణ చేస్తారని హెచ్చరించారు. చంద్రబాబు ఏదో ఒక సైబరాబాద్‌ను తయారు చేశారని.. ఆయన వల్ల అంతో ఇంతో లాభం కలిగిందని చెప్పారు. సీఎం ఇంటి సమీపంలో అంధురాలు ఎస్తేరు రాణి హత్య జరిగిందని... అంతకు ముందు అనేక సంఘటనలు కూడా జరిగాయన్నారు. ఈ రాష్ట్రంలో ఎవరికి రక్షణ ఉందని రేణుకా చౌదరి ప్రశ్నించారు.

## టాయిలెట్లు శుభ్రం చేసిన ముత్తిరెడ్డి



**జనగామ, మార్చి 1 (సమ సమాజం):** జిల్లాలో ఏర్పాటు చేసిన మన ఊరు మన బడి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి టాయిలెట్లను శుభ్రం చేశారు. బచ్చన్నపేట మండలం లింగంపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి... పాఠశాలలో బాత్రూంలు అపరిశుభ్రంగా ఉండటంపై ప్రధానోపాధ్యులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనే స్వయంగా టాయిలెట్స్ శుభ్రం చేశారు.

## మెడికో ప్రీతి ఘటనపై జ్యుడిషియల్ విచారణ చేయ్యాలి

సొంతంగా మత్తు ఇంజెక్షన్ తీసుకోవడం అసాధ్యం ● ప్రీతి మరణంపై మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్



**హైదరాబాద్, మార్చి 1 (సమ సమాజం):** మెడికో స్టూడెంట్ ప్రీతి ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని మాజీ ఎంపీ, బిజెపి నేత బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు. ప్రీతిది హత్యనా, ఆత్మహత్యనా అన్న విషయాన్ని ప్రభుత్వం తేల్చుకోలేక పోతుందన్న ఆయన.. సొంతంగా ఇంజెక్షన్ తీసుకోవడం అసాధ్యమని చెప్పారు. ప్రీతి మెడికల్ వెంటిలేటర్ పై లేదని, పొలిటికల్ వెంటిలేటర్ మీద ఉందని బూర నర్సయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. హెచ్‌ఆర్సీ ప్రీతిని అపోలో కు షిఫ్ట్ చేయమన్నందుకే డెత్ డిక్లేర్ చేశారని ఆరోపించారు. వెనుకబడిన వారిపై ఆరోపణలు ఉంటే వెంటనే ఎన్ కౌంటర్ అవుతారన్నారు. కానీ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తమ వారైతే ప్రభుత్వం వారి తరపున పోరాడుతుందని చెప్పారు. నేరాలు జరిగిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకోరని, ట్విట్టర్ లో మెస్సేజ్ వస్తేనో, ప్రగతి భవన్ నుంచి ఫోన్ వస్తేనో స్పందిస్తారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. యువకులు మద్యానికి బానిసలై హత్యలు చేస్తున్నారని బూర నర్సయ్య ఆరోపించారు. గతంలో తెలంగాణలో నడిరోడ్డుపై చంపడం చూశామని, పోలీసు వ్యవస్థ ను బీఆర్ఎస్ కు మరో విభాగంగా తయారు చేశారని మండిపడ్డారు. మద్యం, మత్తు, మతమే రాష్ట్రంలో నేడు కనిపిస్తున్నాయని ఆయన చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి ఏం చేస్తున్నారు అని బూర నర్సయ్య ప్రశ్నించారు. బీజేపీ వి కార్నర్ మీటింగ్ లు అయితే బీఆర్ఎస్ వి క్యాష్ మీటింగ్ లు అంటూ విమర్శలు సంధించారు. రాష్ట్రంలో 11వేల మీటింగ్ లు నిర్వహించామని, ఇది ఏ పార్టీకి సాధ్యం కాదని చెప్పారు. ప్రతి సమావేశంలో 200మంది పాల్గొన్నారన్నారు. రాష్ట్రంలో 60లక్షల మందిని మేం టచ్ చేశామన్న ఆయన... తెలంగాణ ప్రజలు ఓట్లేస్తేనే హీరో లు అవుతారు... లేదంటే జీరోలు అవుతారంటూ వ్యాఖ్యానించారు. పెద్దనాయకులు కాదు.. పేద నాయకులను గెలిపించండని కోరారు. బీఆర్ఎస్ అవినీతి కుటుంబ పాలనను అంతం చేయాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని బూర నర్సయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలక్, విస్తరాకు అంటూ బీజేపీని అవమానించేలా మాట్లాడితే ... భవిష్యత్తులో మీరు వాటిపైనే తినాల్సి ఉంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. మోడీ మీద అభాండాలు వేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పిల్లలు పదో తరగతికి కూడా రాకముందే మద్యం తాగుతున్నారని, దాని వల్ల హాస్టల్స్ లో ఆకృత్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎక్సైజ్ ప్రోహిబిషన్ శాఖ కాకుండా ఎక్సైజ్ అండ్ ప్రమోషన్ శాఖగా పేరు మార్చుకోవాలని సెటైరికల్ కామెంట్స్ చేశారు. కల్వకుంట్ల కుటుంబం అన్ని వర్గాల వారిని వాడుకుని వదిలేస్తోందని బూర నర్సయ్య ఆరోపించారు.

గురు వారం, 02. 03. 2023

www.samasamajam.in

సమ సమాజం




# శ్రీ చైతన్య ప్రైవేటు కాలేజీలో రాలిన మరో విద్యాకుసుమం



(మొదటి పేజీ తరువాయి) అడ్మిన్ ప్రిన్సిపల్ ఆచార్య కొడుతున్న విజువల్స్ బయటికొచ్చాయి. కాలేజీలో కులం పేరుతో దూషించేవాడని, తనకున్న ఆస్తుల గురించి చెబుతూ విద్యార్థులను చిన్నచూపు చూసేవాడని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కాలేజీ హాస్టల్ ఇన్ చార్జ్ నరేష్ కూడా విద్యార్థులను బూతులు తిడుతూ ఉంటాడని చెబుతున్నారు. సాత్విక్ ఆత్మహత్య ఘటనపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. రోడ్డుపై బైఠాయించి విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలుపుతున్నారు. దీంతో దాదాపు 2 కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. మంచి విద్యాబుద్ధులు నేర్చుకొని ప్రయోజకుడు అవుతాడని భావించిన తల్లిదండ్రులకు పుత్రశోకం తప్పలేదు. కళాశాల యాజమాన్య వేధింపులు ఒత్తిడి తట్టుకోలేక ఓ ముక్కు పచ్చలారని విద్యార్థి జీవితం బలయింది. హైదరాబాద్ లోని నార్సింగ్ ప్రాంతంలో ఓ ప్రైవేటు కాలేజీలో ఈ దారుణం చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన నాగుల రాజు అనే వ్యక్తి కుమారుడు నాగుల సాత్విక్ (16) తన క్లాస్ గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ముక్కు పచ్చలారని ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి క్లాస్ గదిలో ఉరివేసుకోవడం పట్ల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల ముందు ఆందోళన నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్ వార్డెన్ ఎక్కువ వేధింపులకు గురి చేశారని బాధితులు పేర్కొంటున్నారు. అదేవిధంగా రాత్రి 10 గంటలకు స్టడీ అవర్స్ అయిపోయాక విద్యార్థులందరూ హాస్టల్ గదికి చేరుకున్నారు. సాత్విక్ మాత్రం హాస్టల్ కు వెళ్లకుండా క్లాస్ గదిలోనే బట్టలు ఆరవేసే వైరుతో ఫ్యాన్ కు ఉరివేసుకున్నాడు. ఈ దారుణం గమనించిన కొంతమంది విద్యార్థులు గోల చేయగానే వార్డెన్ అక్కడికి వచ్చాడు. కొన ఊపిరితో ఉన్న సాత్విక్ ను రక్షించే ప్రయత్నం చేయలేదు. పైగా విద్యార్థులపై అరిచి వారిని అక్కడ నుండి వెళ్లగొట్టి గదికి తాళం వేశాడు. కొన ఊపిరితో ఉండగానే గదికి తాళం వేయడంతో దాదాపు పావుగంట ఆలస్యం అయింది. సకాలంలో ఆసుపత్రికి తరలించి ఉంటే సాత్విక్ బ్రతికేవాడు. ఆ తర్వాత విద్యార్థులు రెచ్చిపోయి ఆందోళన చేపట్టడంతో వార్డెన్ గది తాళం తీశాడు. అప్పటికే ఇంకా సాత్విక్ కొనఊపిరితోనే ఉండడం గమనార్హం. రక్షించే ప్రయత్నం చేయకపోవడంతో సాత్విక్ మృత్యువాత పడ్డాడు. ఈ వ్యవహారం తెలుసుకొని మృతుడి బంధువులు వార్డెన్, ప్రిన్సిపల్ పై బుధవారం దాడికి దిగారు. కళాశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కళాశాల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాత్రి 8 గంటలకే తండ్రి నాగుల రాజు తన కుమారుని చివరిసారిగా కలిసినట్టు చెప్పారు. పరీక్షలు అయిపోయాక ఇంటికి రావాలని కోరారు. అంతకు ముందు విద్యార్థి సాత్విక్ ఇంట్లో తన నానమ్మకు తనపై ఒత్తిడి పెడుతున్నారని బాగా కొడుతున్నారని చెప్పి వాపోయినట్లు చెబుతున్నారు. సాత్విక్‌ను పెద్ద ఎత్తున ఒత్తిడికి గురిచేయడం తిట్టడం, కొట్టడం వల్లే మనస్థాపాన్ని గురై ఆత్మహత్య చేసుకున్నాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు. గత వారం రోజులుగా సాత్విక్ తోటి విద్యార్థుల ముందు ఉరి ఎలా వేసుకోవాలనే అనుమానాలను అడిగి తెలుసుకుంటున్నట్లు చెబుతున్నారు. యాజమాన్య వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని, కళాశాల యాజమాన్యం పై అదే విధంగా ప్రిన్సిపాల్, వార్డెన్ పై హత్య కేసు నమోదు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు..

# అత్యాచారలకు పాల్పడే వారి ఇళ్లను బుల్‌డోజర్లతో కూలుస్తాం

(మొదటి పేజీ తరువాయి) బీజేపీ ప్రభుత్వం వచ్చాక మహిళలను కన్నెత్తి చూడాలంటే ఆకతాయిలు వణకాలన్నారు. ఎస్టీ మహిళను రాష్ట్రపతిని చేసి మహిళలకు గౌరవం తెచ్చిన ఘనత ప్రధాని మోదీదేనని బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ హాయాంలో మహిళలను చితిమీద పడుకోబెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. మహిళలకు తాళం చెవి ఇచ్చిన కుటుంబం బాగుంటుందన్నారు. తన కేబినెట్‌లోఎనిమిది మంది మహిళలకు మంత్రులుగా మోదీ అవకాశం కల్పించారన్నారు. ఎనిమది మంది గవర్నర్లు, నలుగురు మహిళా ముఖ్యమంత్రులను చేసిన ఘనత బీజేపీదేనన్నారు. కేసీఆర్ హాయాంలో తెలంగాణలో రోజుకో అత్యాచారం జరుగుతోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే బీజేపీ మహిళ విభాగం బలంగా ఉందని బండి సంజయ్ పేర్కొన్నారు. బీఆర్ఆర్‌లో మహిళలకు గౌరవం లేదన్నారు. లిక్కర్ దందా, డ్రగ్స్ దందా, పత్తాలాట అన్నీ



# స్కూల్ పిల్లలపై దూసుకెళ్లిన కారు

(మొదటి పేజీ తరువాయి) డ్రైవర్‌ను కాలేజీ స్టూడెంట్‌గా గుర్తించారు. తన స్నేహితులతో కలిసి ఏలగిరి కొండకు విహారయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగా అతడు డ్రైవ్ చేస్తున్న కారు అదుపుతప్పినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడైన కాలేజీ స్టూడెంట్ ఆ సమయంలో మద్యం సేవించి లేదని పోలీసులు చెప్పారు. ర్యాష్, నిర్లక్ష్యం డ్రైవింగ్ వల్ల ముగ్గురు పిల్లల మరణానికి కారణమైన నిందితుడిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మరోవైపు కారు దూసుకెళ్లడంతో మరణించిన ముగ్గురు స్కూల్ విద్యార్థుల కుటుంబాలకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ సంతాపం తెలిపారు. నిర్లక్ష్యపు కారు ప్రమాదాన్ని ఆయన ఖండించారు. బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

# ముంబైలో భారీగా డ్రగ్స్ పట్టివేత

## ఎయిర్‌పోర్టులో రూ. 25 కోట్లు విలువ చేసే కొకైన్ స్వాధీనం

**ముంబై, మార్చి 1 (సమ సమాజం):** ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 2.58 కిలోల అంటే రూ. 25 కోట్లు విలువ చేసే కొకైన్ 12 సోప్ బార్లు పట్టుబడ్డాయి. ఇథియోపియా అడిస్ అబాబా నుంచి వచ్చిన వ్యక్తి ట్రాలీ బ్యాగ్‌లో డ్రగ్స్ ఉన్నట్టు గుర్తించారు. ఆ వ్యక్తితో పాటు అతనికి సహాయకుడిని అదుపులోకి డీఆర్ఐ అధికారులు తీసుకున్నారు. అతడు ఎక్కడికి తీసుకు వెళుతున్నాడు? ఎవరికి చేరవేయబోతున్నారు? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇంటెలిజెన్స్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు, ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. దేశంలో డ్రగ్స్ అక్రమ రవాణాపై డీఆర్ఐ, నార్కోటిక్స్ అధికారులు, ఎయిర్ పోర్ట్ లలో కస్టమ్స్ అధికారులు ఎక్కడికక్కడ ఉక్కు పాదం మోపుతున్నారు. అయినా డ్రగ్స్ దందా చాప కింద నీరులాగా సాగుతోంది.

# మొఘల్‌పురాలో యువకుడిని బాదిన పోలీసులు

(మొదటి పేజీ తరువాయి) సమయంలో మొఘల్‌పురా కమాన్ దగ్గర స్థానిక పోలీసులు.. తమ తమ్ముడిని ఆపారని మహమ్మద్ ఇబ్రహీం చెప్పాడు. ఎందుకు ఆపుతున్నారు..? ఇంటికి వెళ్తున్నమని చెప్పడంతో తనను పోలీసులు ఇష్టం వచ్చినట్లు కొట్టారని మహమ్మద్ ఇబ్రహీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కాళ్లు, చేతులపై విచక్షణ రహితంగా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మొఘల్ పురా పోలీసులు తనను ఎలా కొట్టారో సీసీటీవీ ఫుటేజీని పోలీసు ఉన్నతాధికారులకు అందించాడు. దక్షిణ మండలం డీసీపీ సాయిచైతన్య ఈ ఘటనపై మొఘల్ పురా పోలీసులను వివరణ కోరారు.

# యూకె పర్యటనలో రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి) విజిటింగ్ ఫెలో అయిన రాహుల్ గాంధీ 'లెర్నింగ్ టు లిజన్ ఇన్ 21వ శతాబ్దం' అనే అంశంపై ప్రసంగిస్తారు. హెయిర్ స్టైల్ మార్చిన గడ్డంతో ఉన్న కాంగ్రెస్ ఎంపీ ఫొటోలను సోషల్ మీడియాలో చాలా మంది షేర్ చేశారు కొందరు ఔలిఒనీనీ అనే హ్యాష్ట్యాగ్ని ఉపయోగిస్తున్నారు. 52 ఏళ్ల రాహుల్ ఇటీవల తన 12-రాష్ట్రాల పాదయాత్రలో భాగంగా భారీగా జుట్టు,గడ్డాన్ని పెంచుకున్నాడు. నాలుగు నెలల్లో దాదాపు 4000 కి.మీ పాదయాత్ర చేశాడు. కేంబ్రిడ్జ్‌లో రాహుల్ గాంధీ 'బిగ్ డేటా అండ్ డెమోక్రసీ' 'ఇండియా-చైనా సంబంధాలు' అనే అంశంపై యూనివర్శిటీ కార్పస్ క్రిస్టీ కాలేజ్ అండ్ కోలో భారతీయ సంతతికి చెందిన ఫెలో ట్యూటర్ డైరెక్టర్ ఆఫ్ స్టడీస్ ప్రొఫెసర్ శ్రుతి కపిలాతో కలిసి ఈ సెషన్లను నిర్వహించాలని యోచిస్తున్నారు.ఈ సందర్భంగా భారత జాతీయ కాంగ్రెస్కు చెందిన భారత ప్రధాన ప్రతిపక్ష నాయకుడు.. ఎంపీ రాహుల్ గాంధీకి స్వాగతం పలకడం ఆనందంగా ఉంది' అని కేంబ్రిడ్జ మంగళవారం ట్వీట్ చేసింది. కాంగ్రెస్ నాయకుడు ఈ ట్వీట్ను పంచుకుంటూ 'నా అల్మా మేటర్ కేంబ్రిడ్జ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఉపన్యాసం ఇవ్వడానికి ఎదురు చూస్తున్నాను. భౌగోళిక రాజకీయాలు అంతర్జాతీయ సంబంధాలు పెద్ద డేటా మరియు ప్రజాస్వామ్యంతో సహా వివిధ డొమైన్లలో కొన్ని ప్రకాశవంతమైన వ్యక్తులతో ఉన్నందుకు సంతోషంగా ఉంది. .' అని రాహుల్ ట్వీట్ చేశాడు. కాంగ్రెస్ నాయకుడు చివరిసారిగా మేలో యూకే పర్యటన సందర్భంగా కార్పస్ క్రిస్టి కాలేజీలో 'ఇండియా ఎట్ 75' అనే కార్యక్రమంలో కేంబ్రిడ్జ విశ్వవిద్యాలయాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాయ్‌పూర్‌లో మూడు రోజుల కాంగ్రెస్ నాయకత్వ సమావేశం ముగిసిన వెంటనే రాహుల్ గాంధీ యూకే వెళ్లారు.

# దేశంలోనే అతి పెద్ద ప్రోటో టైపింగ్ సెంటర్ టీ వర్క్స్

## నేడు ప్రారంభించనున్న మంత్రి కెటిఆర్



**హైదరాబాద్, మార్చి 1 (సమ సమాజం):** టాలెంట్ ఎవరి సొత్తు కాదని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ నాలుగు సంవత్సరాలుగా రన్ చేస్తున్నామన్న కేటీఆర్.. వినూత్న ఆలోచనలతో ఔత్సాహిక యువకులు ఎవరు ముందుకు వచ్చినా తాము సపోర్ట్ చేస్తానని హామీ ఇచ్చారు. ఇమేజ్ టవర్స్ ను 2023 లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం దేశంలోనే అతి పెద్ద ప్రోటో టైపింగ్ సెంటర్ టీ వర్క్స్ ను ప్రారంభిస్తామని చెప్పారు. చైనాకు చెందిన ఫాక్స్ కాన్ ఛైర్మన్ యంగ్ లీవ్ టీ వర్క్స్ ను ప్రారంభిస్తారన్నారు. ఇక్కడ వందల వేల స్టార్టప్‌లు పనిచేస్తాయన్న మంత్రి కేటీఆర్... రూ.15 వేల కోట్ల మిషనరీతో టీ వర్క్స్ ప్రారంభం అవుతుందన్నారు. రూ.100 కోట్లకు పైగా విలువ చేసే మిషనరీకి పెట్టుబడులు తెచ్చెదుకు ఎ÷-లాన్ చేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. గ్రామీణ ప్రాంత ఓత్సాహిక యువతకు టీ వర్క్స్ ఉపయోగపడుతుందన్న కేటీఆర్.. డిజైనింగ్ ఇన్నోవేషన్ , మెటీరియల్ సైన్స్ పై విద్యార్థుల్లో అవగాన పెంచాలని సూచించారు. టీ వర్క్స్ ను స్కూల్ విద్యార్థులకు కూడా తీసుకు వస్తామని, వారికి కూడా అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌లలో ఇక్కడ జరిగే ఇన్నోవేషన్స్ తెలిసేలా శాటిలైట్ సెంటర్స్ పెడతామని చెప్పారు. గ్రామీణ ప్రాంత ఇన్నోవేటర్స్ కు జిల్లాలో ఉన్న ఐటీ టీమ్ గైడ్ చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# కెసిఆర్ అండతో ఆలయాలకు పూర్వవైభవం



(మొదటి పేజీ తరువాయి) ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ, ఆలయ గోపురం ప్రతిష్ఠ, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి పాద స్పర్శతో తిరుమలాయ పల్లె గ్రామం పావనం అయిందని అన్నారు. నాంచారిమడూరు, సన్నూరు, పాలకుర్తి, బమ్మెర, వల్మీడి తదితర గ్రామాలలో గుడులన్నింటికీ పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఆలయానికి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల వరకు మంజూరు చేయించానని, మరో రూ.50 లక్షల నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని మంత్రి వివరించారు . సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో, శాంతి సౌఖ్యాలతో ఉండాలని, కేసీఆర్ పరిపాలన సుదీర్ఘంగా సాగాలని దేవుణ్ని కోరుకున్నానని మంత్రి తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి మాట్లాడుతూ ప్రతిష్ఠాపన పూర్తి కావడంతో ఇక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారు ప్రజలకు దర్శనం ఇస్తారని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చాక దేవాలయాల జీర్ణోద్ధరణ, పునరుద్ధరణ బాగా జరిగిందని అన్నారు.

# కార్డియాక్ అరెస్ట్‌ను నిరోధించడం ముఖ్యం



(మొదటి పేజీ తరువాయి) అవసరమవుతుందన్నారు. అలా మంత్రులు కూడా వచ్చి సీపీఆర్ ఎలా చేయాలో తెలుసుకున్నారు. మంత్రి మల్లారెడ్డి కూడా సీపీఆర్ చేయడం ట్రయల్ చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ .. ఇటీవల కాలంలో నాన్ కమ్యూనికేబుల్ రోగాలు అధికంగా వస్తున్నాయని కేటీఆర్ తెలిపారు. దాంట్లో అతి ముఖ్యమైనది సడెన్ కార్డియాక్ అరెస్ట్. సోషల్ మీడియాలో ఒక ఆశ్చర్యకరమైన వీడియోను చూశాను. మొన్న ఓ పిల్లోడు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోయాడు. జిమ్‌లో వర్కవుట్ చేస్తూ మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడని కేటీఆర్ తెలిపారు. ఆ ప్రదేశాల్లో సీపీఆర్ శిక్షణ పొందిన వారు ఉంటే వారి ప్రాణాలను కాపాడేవారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, మాల్స్, బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లలో సీపీఆర్ శిక్షణ పొందిన వారిని నియమించాలన్నారు. లైఫ్ స్టైల్ ఛేంజెస్ వల్ల ఈ రోగాలు చుట్టుముడుతున్నాయి. సీపీఆర్‌ను నేర్పించగలిగితే చాలా వరకు సడెన్ కార్డియాక్ అరెస్టును తగ్గించొచ్చన్నారు. రక్త ప్రసరణ ఆగిపోకుండా ప్రాథమికంగా ఆ వ్యక్తిని కాపాడుకోవచ్చు అని కేటీఆర్ సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో తెలంగాణ వైద్యారోగ్య శాఖ బ్రహ్మాండంగా ముందుకు పోతోందని కేటీఆర్ ప్రశంసించారు. ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా ఒక వైపు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నగరంలో నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, వరంగల్‌లో 2 వేల పడకల ఆస్పత్రి నిర్మిస్తున్నాం. బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు ఏర్పాటు చేశాం. ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నాం. కంటి వెలుగు కార్యక్రమం అద్భుతంగా విజయవంతమైంది. వైద్య వ్యవస్థ మీద విశ్వాసాన్ని పెంచాం. మాతా శిశు మరణాలు తగ్గాయి. ఇలా అద్భుతంగా ముందుకు పోతున్నాం. కొత్తగా జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అన్ని వర్గాల విద్యార్థులకు వైద్య విద్యలో అవకాశాలు కల్పిస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. అనంతరం మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ తొలిదశలో నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో సిపిఆర్ యూనిట్లు ఏర్పాట్లు చేస్తామన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయడంతో పాటు అవగాహన కల్పిస్తామని అన్నారు. దీంతో సడెన్ డెత్‌లను తగ్గించవచ్చన్నారు. ఈ సందర్భంగా సిపిఆర్‌లో కాపాడిన కానిస్టేబుల్‌ను, మరో ఉద్యోగిని మంత్రి కెటిఆర్ సత్కరించారు.

# హైదరాబాద్ నుండి నీటిపారుదల పనులలో వేగవంతం పెంచాలి

- భూసేకరణ లో అలసత్వం వలదు
- సోలిపురం బ్రిడ్జి నిర్మాణపు పనులు తక్షణం ప్రారంభించాలి
- పెండింగ్ లో ఉన్న చౌటుప్పల్ మినీ ట్యాన్క్ బండ నిర్మాణపు పనులు పూర్తి చేయాలి
- మినీ ట్యాన్క్ బండా నిర్మాణపు పనులను అలసత్వం చేసిన కాంట్రాక్టర్ ను పక్కకు తప్పించండి
- మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి జగదీష్ రెడ్డి సమీక్ష



పాల్గొన్న శాసనసభ్యులు కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,గాధరి కిశోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్,రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్,ఇ ఇ రాములు జిల్లా నీటిపారుదల అధికారి ప్రభు కళ్యాణ్ తదితరులు మునుగోడు నియోజకవర్గ పరిధిలో మొదలు పెట్టిననీటిపారుదల పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అధికారులను ఆదేశించారు.అందుకు సంబంధించిన భూసేకరణ లో అలసత్వం చూపొద్దని ఆయన అధికారులకు సూచించారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలో నీటిపారుదల శాఖా చేపట్టిన శివన్న గూడెం ప్రాజెక్ట్ కు సంబంధించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తో పాటు, లక్ష్మణపురం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ శశిలేటి వాగు ఫిడర్ చానల్ కు సంబంధించిన భూసేకరణ మరియు నిర్మాణపు పనులు,వెలిమకన్నే,బెందలమ్మ చెరువు, సోలిపురం బ్రిడ్జి,చెక్ డ్యామ్ లు చౌటుప్పల్ లోని మినిట్యాన్క్ బండ నిర్మాణాల పురోగతి పై బుధవారం సాయంత్రం హైదరాబాద్ లోని తన ఛాంబర్ లో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మునుగోడు శాసనసభ్యులు కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తో పాటు శాసనసభ్యులు గాధరి కిశోర్ కుమార్ ,చిరుమర్తి లింగయ్యజిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్,రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్,ఇ ఇ రాములు జిల్లా నీటిపారుదల అధికారి ప్రభు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ శివన్న గూడెం,లక్ష్మణపురం ప్రాజెక్ట్ ల నిర్వాసితులకు తక్షణం ప్లాట్లు మంజూరు ఇవ్వాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన పేపర్ వర్క్ ను వేగిరపరచాలని ఆయన చెప్పారు. అదే విదంగా శశిలేటి వాగు ఫిడర్ కు సంబంధించిన పనులను వేగవంతం చెయ్యడం తో పాటు అందుకు సంబంధించిన భూసేకరణ ను పూర్తి చేయాలన్నారు.అదే విదంగా ఇటీవల మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సోలిపురం బ్రిడ్జి నిర్మాణపు పనులను ప్రారంభించడం తో పాటు పెండింగ్ లో ఉన్న చౌటుప్పల్ మినీ ట్యాన్క్ బండ నిర్మాణపు పనులు పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మినీ ట్యాన్క్ బండ నిర్మాణపు పనులు చేపట్టి పూర్తి చెయ్యలేక పోయిన సదరు కాంట్రాక్టర్ కు నోటీస్ ఇచ్చి పక్కకు తప్పించి మరొకరితో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలంటూ ఆయన అధికారులను ఆదేశించారు.

# ఢిల్లీ నుండి బిజెపిని తరిమే రోజులు వచ్చాయి

## తెలంగాణకు ఏం చేశారో చెప్పాలి ● కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి జగదీశ్ రెడ్డి

**నల్లగొండ, మార్చి 1 (సమ సమాజం):** బండి సంజయ్ విమర్శలతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. తెలంగాణాకు బీజేపీ పార్టీ ఏం చేశారని ప్రజల్లోకి వెళ్తున్నారన్నారు. మీ మాటలకు మోసపోయే జనం తెలంగాణలో లేరని అన్నారు. డబుల్ ఇంజిన్ పేరుతో చేస్తున్న ఆర్భాటాలతో ప్రయోజనం శూన్యమని పక్కనే ఉన్న కర్నాటక ప్రజలను అడిగితే తెలుస్తుందన్నారు. 2014 కు ముందు తెలంగాణ పరిస్థితి ఏంటి ...ఇప్పటి పరిస్థితి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. కేంద్రంలోని ప్రభుత్వాన్ని మార్చాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. దేశ ప్రజల ఆకాంక్ష నెరవేర్చడానికి కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఢిల్లీ కోట నుండి బీజేపీని తరిమెందుకే అన్ని రాష్ట్రాలనుంచి యాత్రలన్ని ఢిల్లీ వైపు సాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ బండి సంజయ్‌ని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే తెలంగాణా అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళుందన్నారు. తెలంగాణాకు కేంద్రం ఏం చేసిందో సంజయ్ ప్రజలకు చెప్పాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల తెలంగాణా లాంటి పథకాలు ఉన్నాయా అంటూ మంత్రి ప్రశ్నించారు. పెంచిన పెట్రోల్ , గ్యాస్ రేట్లు గురించి చెబుతారా అంబానీ , ఆదాని లు బాగుపడ్డారని చెబుతారా? అంటూ ఎద్దేవా చేశారు మంత్రి. తెలంగాణకు కేసీఆర్ ని మించి మోడీ ఏంచేశారో చెప్పాలన్నారు. బీజేపీ ఆటలు ఇంకా దేశంలో చెల్లవన్నారు. ఢిల్లీ నుండే బీజేపీని బయటకు తరముతుంటే ఇంకా కొత్త రాష్ట్రాల్లో అధికారం ఎక్కడి నుండి వస్తుందని ఎద్దేవా చేశారు.తాజాగా పెంచిన గ్యాస్ ధరలపై సమాధానం ఇచ్చుకోవాలన్నారు.

# మూడో టెస్టులో ఆధిక్యం చాటిన ఆస్ట్రేలియా

నాలుగు వికెట్ల నష్టానికి 156 పరుగులు

భారత్ కంటే 47 పరుగుల ఆధిక్యంలో ఆసిస్

భారత్‌ను 109 పరుగులకే ఔట్ చేసిన బౌలర్లు



**ఇండోర్, మార్చి 1 (సమ సమాజం):** బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఆధిక్యంలో నిలిచింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 109 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు నష్టపోయి 156 పరుగులు చేసింది. ఫలితంగా భారత్ కంటే 47 పరుగుల ఆధిక్యంలోకి వెళ్లింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (60) రాణించాడు. టాప్ ఆర్డర్ బ్యాటర్‌లు మార్నస్ లబుషగ్నే (31), స్టీవ్ స్మిత్ (26) కూడా పర్వాలేదనిపించారు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (9) విఫలమయ్యాడు. భారత బౌలర్‌లలో రవీంద్ర జడేజా జోరు కొనసాగింది. రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏడు వికెట్లు తీసిన జడేజా.. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో మొత్తం నాలుగు వికెట్లు అతని ఖాతాలోనే పడ్డాయి. అంతకు ముందు భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. ఆసీస్ స్పిన్నర్ల ధాటికి భారత బ్యాటర్‌లు వరుసగా పెవిలియన్‌కు క్యూకట్టారు. విరాట్ కోహ్లీ (22), శుభ్‌మన్ గిల్ (21), ఉమేశ్ యాదవ్ (17 ) శ్రీకర్ భరత్ (17), అక్షర్ పటేల్ (12), రోహిత్ శర్మ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. మిగిలిన ప్లేయర్లు అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. దాంతో భారత్ 109 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆసీస్ బౌలర్లలో మాథ్యూ కుహ్నెమాన్ 5, నాథన్ లియాన్ 3 వికెట్లు తీశారు. టాడ్ మర్ఫీకి ఒక వికెట్ దక్కింది.

# మూడో టెస్టులో తడబడ్డ భారత్ బౌలర్లు

తొలి ఇన్నింగ్స్‌లో 109 పరుగులకే ఆలౌట్

**ఇండోర్, మార్చి 1 (సమ సమాజం):** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా తొలి రెండు టెస్టుల్లో సంపూర్ణ ఆధిపత్యం కనబరిచిన టీమిండియా.. మూడో టెస్టులో తడబడింది. ఇండోర్ వేదికగా బుధవారం ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 109 పరుగులకే ఆలౌటైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా మూడో టెస్టులో ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోయింది. పరుగులు చేయడంలో టీమిండియా ఆటగాళ్లు మొత్తం విఫలమయ్యారు. ఆసీస్ స్పిన్నర్ల ధాటికి వరుసగా వికెట్లు కోల్పోయి క్రీజుకు చేరారు. విరాట్ కోహ్లీ (22), శుభ్‌మన్ గిల్ (21), ఉమేశ్ యాదవ్ (17 ) శ్రీకర్ భరత్ (17), అక్షర్ పటేల్ (12), రోహిత్ శర్మ (12) దారుణంగా విఫలమయ్యారు. మిగిలిన ప్లేయర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఫలితంగా 109 పరుగులకే టీమిండియా ఆలౌటైంది.



# మార్‌క్రమ్ సెంచరీ

సెంచూరియన్, మార్చి 1 (సమ సమాజం): వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 314/8 స్కోరు సాధించింది. మంగళవారం ఆరంభమైన ఈ మ్యాచ్‌లో ఓపెనర్లు మార్‌క్రమ్ (115) శతకం, ఎల్గర్ (71) అర్ధసెంచరీ సాధించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 141 పరుగులు జోడించారు. ప్రస్తుతం క్రీజులో జాన్సెన్ (17), కొయెట్జ్ (11) ఉన్నారు. జోసె?ఫకు 3 వికెట్లు దక్కాయి.

# మెస్సీకి ఫిఫా బెస్ట్ ప్లేయర్ అవార్డు




పారిస్,మార్చి 1 (సమ సమాజం): అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ.. ఫిఫా బెస్ట్ ప్లేయర్ అవార్డు గెలుచుకున్నాడు. గతేడాదికిగాను ప్రకటించిన ఈ పురస్కారాల్లో అత్యుత్తమ మహిళా ఫుట్‌బాలర్‌గా స్పెయిన్‌కు చెందిన అలెక్సియా నిలిచింది. పారిస్‌లో జరిగిన వేడుకలో అవార్డులను అందుకున్నారు.

# ఐసీసీ టెస్ట్ బౌలర్స్ ర్యాంకింగ్స్‌లో అశ్విన్ అగ్రస్థానం

**న్యూఢిల్లీ, మార్చి 1 (సమ సమాజం):** భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ ఐసీసీ టెస్ట్ బౌలర్స్ ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇప్పటిదాకా అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లండ్ బౌలర్ జేమ్స్ అండర్సన్‌ను రెండో స్థానానికి నెట్టేశాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఢిల్లీలో ఆస్ట్రేలియా జట్టుతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో ఆరు వికెట్లు పడగొట్టడం ద్వారా అశ్విన్ ఈ ఘనత దక్కించుకున్నాడు. కాగా, 36 ఏండ్ల అశ్విన్ 2015లో తొలిసారి ఐసీసీ టెస్ట్ బౌలర్స్ ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి పలు సందర్భాల్లో అశ్విన్ అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్ సందర్భంగా టాప్ బ్యాటర్‌లు మార్నస్ లబుషగ్నే, స్టీవ్ స్మిత్‌లను ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. ఆ తర్వాత మరో బ్యాటర్ అలెక్స్ క్యారీ వికెట్‌ను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో కూడా పిచ్ స్పిన్‌కు అనుకూలించడంతో అశ్విన్, రవీంద్ర జడేజా రెచ్చిపోయారు. అశ్విన్.. ఆస్ట్రేలియా టాప్-5 బ్యాటర్లలో ముగ్గురిని ఔట్ చేయగా, జడేజా మిగతా ఏడు వికెట్లను తీసి ఔరా అనిపించాడు. ప్రస్తుతం ఐసీసీ టెస్ట్ బౌలర్స్ ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 864 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. 859 పాయింట్లతో జేమ్స్ అండర్సన్ ఆ తర్వాత స్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ జడేజా 8వ స్థానంలో ఉన్నాడు.






# నాటునాటు పాటకు మరోమారు పట్టం




ఆస్కార్ వేదికపై పాడనున్న రాహుల్ సిప్లిగంజ్, కాల భైరవలు

నాటు నాటు ప్రభంజనం ఆస్కార్ స్టేజ్‌పైకి ఎక్కబోతోంది. ఈ నెల **12**న ది అకాడెమీ **95**వ ఆస్కార్ అవార్డులను ప్రదానం చేయనుంది. ఆస్కార్ వేదిక పై మన పాటను రాహుల్ సిప్లిగంజ్, కాల భైరవలు . లైవ్ లో పాడనున్నారు.నిజంగా ఇది మామూలు విషయం కాదు. తెలుగు జెండాను అమెరికాలో రెపరెపలాడించ బోతన్నారు మన కుర్రాళ్లు. ట్రిపులార్ రికార్డులు, రివార్డులు, అవార్డులకు మించిన విషయమిది. ఇలా నాటు నాటు ప్రభంజనం ఆస్కార్ స్టేజ్‌పైకి ఎక్కబోతోంది. ఈ నెల **12**న ది అకాడెమీ **95**వ ఆస్కార్ అవార్డులను ప్రదానం చేయనుంది. అదే రోజు అదే స్టేజ్‌పై మన నాటు నాటు పాటని పాడబోతున్నారు సింగర్లు రాహుల్ సిప్లిగంజ్, కాల భైరవ. ఆస్కార్ స్టేజ్‌పై అగ్గిరాజేయబోతున్నారు. హాలీవుడ్‌ని షేక్ చేసే పెర్ఫామెన్స్ ఇవ్వనున్నారు ఈ ఇద్దరు సింగర్స్. ఒరిజినల్‌గా ఈ పాటను సినిమాలో వీరిద్దరే పాడారు. ఆస్కార్స్ అంటే.. వరల్డ్ వైడ్‌గా ఎంత పాపులరో అందరికీ తెలుసు. వరల్డ్ వైడ్ సినిమా ఇండస్ట్రీలో దీన్ని మించిన అవార్డుల కార్యక్రమం మరొటి లేదు. చాలా మంది ఆస్కార్స్ వరకు వెళ్తేనే చాలని కలలు కంటుంటారు. ప్రతీ ఏటా మన దేశం నుంచి ఒకరికి పిలుపు వస్తుంటుంది ఆ అతిథి వెళ్లి రెడ్ కార్పెట్‌పై ఫొటో షూట్ చేసుకుని సోషల్ మీడియాలో పెడుతుంటారు. కాని ఇది అలాంటి సాదా సీదా విషయమే కాదు. ఆస్కార్ స్టేజ్‌పై పాడడం.. అది కూడా మన తెలుగు పాట అంటే ఎంతటి గర్వకారణమది. కేవలం సెల్ఫీ కోసం వెళ్లే నటులున్నారు. కాని మన పాటకు పట్టం కడుతోంది ఆస్కార్ స్టేజ్. మన ట్రిపులార్ టీమ్ కోసం రెడ్ కార్పెట్ పరుస్తోంది అమెరికన్ అకాడమీ. ట్రిపులార్‌లో ఏంటి గొప్ప అంటున్న ప్రతీ ఒక్కరికీ.. ఇది కేవలం ఆన్సర్ మాత్రమే కాదు. చెంపపెట్టే అని చెప్పాలి.

## విలనిజంలోనూ నటనను పండిస్తున్న సునీల్




కమెడియన్‌గా కెరియర్ స్టార్ట్ చేసి తరువాత హీరోగా టర్న్ తీసుకొని ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా విలన్ గా దూసుకుపోతున్న నటుడు సునీల్. కమెడియన్ గానే 300కి పైగా చిత్రాలలో సునీల్ నటించి సక్సెస్ ఫుల్ కెరియర్ ని కొనసాగించాడు. ఇక అందాల రాముడు సినిమాతో హీరోగా మారిపోయాడు. ఇక రాజమౌళి మర్యాద రామన్న సినిమాతో సునీల్ ని స్లిమ్ గా మార్చేసి మరోసారి హీరోగా ఎస్టాబ్లిష్ చేసి హిట్ కొట్టాడు. ఈ మూవీ తర్వాత పూలరంగడు సినిమాతో మరో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకున్నాడు తరువాత సునీల్ వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుస సినిమాలు చేస్తూ వచ్చాడు. అయితే హీరోగా తనని తాను పెర్ఫెక్ట్ గా ఎలివేట్ చేసుకునే కథలు తరువాత ఆశించిన స్థాయిలో పడలేదని చెప్పాలి. చాలా సినిమాలు ఎవరేజ్ టాక్ తెచ్చుకోగా కొన్ని డిజాస్టర్ అయ్యాయి. దీంతో మళ్ళీ తనని తను మార్చుకొని క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా సునీల్ ఎస్టాబ్లిష్ అయ్యే ప్రయత్నం చేశారు. ఇక తన స్నేహితుడు త్రివిక్రమ్ సునీల్ ని క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మళ్ళీ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాడు. తరువాత డిస్కో రాజా సినిమాలో విలన్ గా మొదటిసారి సునీల్ తెరపై కనిపించి అలరించాడు. ఇక కలర్ ఫోటో సినిమాలో కూడా నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించి మెప్పించాడు. ఇక పుష్ప సినిమాలో అయితే సుకుమార్ సునీల్ ని మెయిన్ విలన్ గా ఎస్టాబ్లిష్ చేసి స్టార్ ఇమేజ్ తీసుకొచ్చాడు. ఈ సినిమా దెబ్బతో విలన్ గా సునీల్ కెరియర్ పూర్తిగా టర్న్ అయిపోయిందని చెప్పాలి. సౌత్ లో పవర్ ఫుల్ విలన్ లేని లోటుని సునీల్ ఇప్పుడు తీరుస్తున్నాడు. సూపర్ స్టార్ రజినీకాంత్ జైలర్ సినిమాలో మెయిన్ విలన్ గా నటిస్తున్నాడు. ఇక పుష్ప 2లో కూడా అతని పాత్ర కీలకంగా ఉండబోతుంది. కార్తి కామెడీ ఎంట్టంల్గ÷నర్ జపాన్ లో కూడా సునీల్ విలన్ గా కనిపిస్తున్నాడు. శివకార్తికేయాన్ మవీరన్ విశాల్ మార్క్ ఆంటోనీ సినిమాలలో పవర్ ఫుల్ పాత్రలలో కనిపిస్తున్నాడు. వీటిలో మూడు పాన్ ఇండియా సినిమాలు కాగా రెండు ద్విభాషా చిత్రాలు కావడం విశేషం. ఇక హిందీ సినిమాలలో కూడా అతనిని విలన్ పాత్రల కోసం సంప్రదిస్తున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా ప్రస్తుతం తెలుగు నుంచి సునీల్ విలన్ గా పాన్ ఇండియా ఇమేజ్ కి దగ్గర అవుతున్నాడని చెప్పాలి.

## అనిల్ రావిపూడితో బాలయ్య సినిమా

తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో పవర్‌ఫుల్ రోల్

వీరసింహారెడ్డి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకున్న బాలకృష్ణ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. వరుస హిట్స్ తో జోరు మీద ఉన్న అనిల్ రావిపూడి బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ తో దూసుకుపోతున్న బాలయ్య కాంబినేషన్ లో సినిమా అంటే నందమూరి అభిమానులు ఏ రేంజ్ లో ఊహించుకుంటారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే అనిల్ రావిపూడి ఇప్పటి వరకు చేసిన సినిమాలు అన్ని కూడా కమర్షియల్ కామెడీ యాక్షన్ చిత్రాలుగానే తెరకెక్కాయి. ఈ నేపథ్యంలో బాలకృష్ణ నుంచి ఫ్యాన్స్ కోరుకునే క్యారెక్టరైజేషన్ ని ఎలా ఎస్టాబ్లిష్ చేస్తాడు అనే ప్రశ్నలు నందమూరి అభిమానులలో ఉన్నాయి. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా గురించి అప్డేట్ తెరపైకి వచ్చింది. నిజానికి వీరసింహారెడ్డి సక్సెస్ మీట్ లోనే అనిల్ రావిపూడి తన సినిమా కథ బ్యాక్ డ్రాప్ ఏంటి అనేది చెప్పేశాడు. తెలంగాణ బ్యాక్ డ్రాప్‌లో ఈ సారి బాలయ్య భీభత్సం చూస్తారని చెప్పాడు. తాజాగా దీనిపై మరోసారి స్పష్టత వచ్చింది. బాలయ్య క్యారెక్టర్ తెలంగాణ స్లాంగ్ లోనే ఉంటుందని సమాచారం. బాలయ్యనుంచి ఫ్యాన్స్ కోరుకునే పవర్ ఫుల్ డైలాగ్స్ కూడా ఉంటాయని తెలుస్తుంది. అలాగే ఈ సినిమాలో 60 ఏళ్ళ వ్యక్తిగా బాలకృష్ణ కనిపిస్తాడని సమాచారం. దాంతో పాటు సినిమా కథాంశం బట్టి మూడు వేరియేషన్స్ లో బాలకృష్ణ క్యారెక్టర్ ఉంటుందని టాక్. యువకుడిగా ఒక పాత్ర ఉండగా తరువాత మధ్య వయస్కుడి పాత్ర కనిపిస్తుందని దానికి కొనసాగింపుగా 60 ఏళ్ళ వ్యక్తి పాత్ర ఉంటుందని సమాచారం. ఓ విధంగా చెప్పాలంటే కథ మొత్తం ఒక పవర్ ఫుల్ లీడర్ లైఫ్ జర్నీగా ఉండబోతుందని తెలుస్తుంది. ఇందులో యంగ్ బ్యూటీ శ్రీలీల బాలకృష్ణ కూతురి పాత్రలో కనిపిస్తుందని తెలుస్తుంది. ఆమె పాత్ర కూడా సినిమాలో చాలా కీలకంగా ఉండబోతుందని సమాచారం. అనిల్ రావిపూడి తన స్టైల్ ఆఫ్ కామెడీ మిస్ కాకుండానే బాలకృష్ణని యాక్షన్ సీక్వెన్స్ తో పవర్ ఫుల్ గా సినిమాలో ఎలివేట్ చేయబోతున్నట్లు తెలుస్తుంది.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in